
# ఉమ్మడి పాలనలో గోసపడ్డాం..

- స్వరాష్ట్రంలో పరుగులు పెడుతున్న ప్రగతి
- స్వపరిపాలనతో తండాల్లో ఊహించనంత అభివృద్ధి
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేసిన భజరంగ్‌దళ్ సభ్యులు


వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మంత్రిని ఎత్తుకొని ఊరేగిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

పాలమూరు, నవంబర్ 11 : మీ పాలనను మీరే చేసుకునేలా సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని, తొమ్మిదిన్నరేండ్లలో ఊహించని విధంగా అభివృద్ధి సాధించినట్లు ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని జైనల్లీపూర్, లాల్యానాయక్‌తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా, ప్రజలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బోయపల్లి రోడ్‌షోలో మంత్రి మాట్లాడుతూ 55 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ తాగు, సాగునీరు, మౌళిక వసతులు కూడా కల్పించలేదని మండిపడ్డారు. ఇలాంటి పార్టీకి ఎందుకు ఓటు వేయాలని మనమంతా ఆలోచించాల్సిన అవసరమున్నదన్నారు. ఇంటింటికీ తాగునీరు, వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్, పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా వంటి అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన బీఆర్‌ఎస్ పార్టీకి మరోసారి ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తండాలకు మహర్దశ లభించిందని మంత్రి అన్నారు. ఒకప్పుడు లాల్యానాయక్ తండాకు బాట లేక రవాణాకు ఇబ్బందులుండేవని, రోడ్డు సౌకర్యం కల్పించి కష్టాలను తీర్చామన్నారు. త్వరలో సీసీ రోడ్లు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ అనిత, శ్రీనివాస్‌యాదవ్, గిరిజన నాయకుడు ప్రతాప్‌నాయక్, సర్పంచులు లాల మ్మ, విజయశాంతి, ఉపసర్పంచ్ రుక్కమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తాం..

అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ మద్దతు తెలిపింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రిని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మంత్రికి స్వచ్ఛందంగా అండగా నిలుస్తామని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తామని యూనియన్ అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు.

### అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లోకి..

మహబూబ్‌నగర్‌లో పదేండ్లలో ఊహించని అభివృద్ధి చేపట్టారని, అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరినట్లు భజరంగ్‌దళ్ నాయ కులు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ మండలంలో జైనల్లీపూర్‌కు చెందిన భజరంగ్‌దళ్ నాయకులు ఏపీ శ్రీను, రామాంజనేయులు, మాధవిరాజు, అరుణతో పాటు 50మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే మాజీ సర్పంచులు గోపీనాయక్, బుజ్జమ్మతోపాటు 100మంది మంత్రి సమక్షంలో గులాబీ పార్టీలో చేరారు.

### గజమాలతో సన్మానం..

మహబూబ్‌నగర్ టౌన్, నవంబర్ 11 : జిల్లా కేంద్రంలోని 28వ వార్డులోని బండ్లగేరి, కురిహినిశెట్టి కాలనీ, 29వ వార్డు పరిధిలోని కుమ్మరివాడి, మదీనా మజీద్, 32వ వార్డు పరిధిలోని మక్కామసీదు, టీడీగుట్ట ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 29వ వార్డు ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌హదీ, జాకీర్ అడ్వకేట్, బీఆర్‌ఎస్ నాయకులు మంత్రిని గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, గౌరెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతయ్యయాదవ్, వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ అన్వర్‌పాషా, కౌన్సిలర్లు పద్మ, సాదతుల్లా హుస్సేనీ, కో ఆప్షన్ మెంబర్ రామలింగం, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహమాన్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శివరాజు, ఆరెకటిక సంఘం రాష్ట్ర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు వ్యతిరేకులను తరిమికొడుదాం

- 55ఏండ్ల కాంగ్రెస్ పాలనలో పాలమూరు ఎడారైంది
- సీఎం కేసీఆర్ పాలనలో సంబురంగా సాగు
- పదేండ్లలోనూ ఊహించని అభివృద్ధి
- జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె

జడ్చర్ల, నవంబర్ 11 : ఉమ్మడి రాష్ట్రంలో 55ఏండ్లు పాలించిన కాంగ్రెస్ రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, వారి పుణ్యమా అని పాలమూరును కరువుతో ఎడారిగా మార్చారని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మండిపడ్డారు. శనివారం జడ్చర్ల మండలంలోని కోడ్గల్, ఈర్లపల్లి, ఈర్లపల్లితండా, గొల్లపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌తోకలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. గొల్లపల్లిలో సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి డప్పులమోతలతో, బ్యాండు మేళాలతో ఘన స్వాగతం పలికారు. మహిళలతో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బతుకమ్మ ఆడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏండ్లుగా దగాపడ్డ తెలంగాణ నేడు అన్ని రంగాల్లో సీఎం కేసీఆర్ కృషితో అభివృద్ధి సాధిస్తున్నదన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక మళ్లీ రైతులకు అన్యాయం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఆరు గ్యారెంటీల పేరుతో గ్యారెంటీ లేని హామీలు ఇస్తున్నారన్నారు. 55ఏండ్లు పాలించి ఏం ఒకగబెట్టారని, నేడు మళ్లీ ఒక్క ఛాన్స్ అంటూ రావడం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం జడ్చర్ల మండలం గొల్లపల్లికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 30మంది సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా కోడ్గల్‌లో 20మంది, ఈర్లపల్లిలో మాజీ సర్పంచ్ తిరుపతయ్య బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచులు రాజేశ్వర్‌రెడ్డి, మమతానవీన్‌రెడ్డి, హైమావతివెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ముడా డైరెక్టర్ ఇంతియాజ్‌ఖాన్, ఇర్ఫాన్, రామ్మోహన్, నాగిరెడ్డి, గోపాల్, గిరి, బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కులవృత్తులకు ప్రభుత్వం పెద్దపీట

- అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి
- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- మాదాసి, మాదారి కురుమ కులస్తులతో ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

మక్తల్ టౌన్, నవంబర్ 11 : కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కన్నీళ్లే తప్పా ఒరిగిందేమీ లేదని, సీఎం కేసీఆర్ హయాంలో కులవృత్తులకు పెద్దపీట వేసి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే తన స్వగృహంలో నియోజకవర్గంలోని కృష్ణ, ఊట్కూరు మండలాల మాదాసి, మాదారి కురుమ కులస్తుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో తాగు, సాగునీరు లేక ఎంతో మంది పొట్టచేతబట్టుకొని వలసలు వెళ్లారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే సాగునీటితో రైతులు సంబురంగా సాగు చేసుకుంటూ నేడు దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగారన్నారు. గ్రామాల్లో లక్ష్మీపుత్రులుగా పిలుచుకునే కురుమ కులస్తులు నిజాయితీపరులని పేర్కొన్నారు. మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించి మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ గోవిందప్ప, కురుమ సంఘం నాయకుడు నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకులు ఆశిరెడ్డి, శివరాజ్ పాటిల్, కురమ సంఘం నాయకులు శరణప్ప, ఎల్లలింగ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిక

మున్సిపాలిటీలోని 7వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌గౌడ్, రాజుల ఆశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాబంధులకు ఓటేస్తే రాష్ట్రాన్ని దోచేస్తారు

- కాంగ్రెస్‌ను నమ్మితే చీకటి రాజ్యం
- మంచి చేస్తున్న వారిని మరోసారి ఆదరించాలి
- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, నవంబర్ 11 : కాంగ్రెస్ రాబందులకు ఓటు వేస్తే రాష్ట్రాన్ని దోచేస్తారని, ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసిన వారిని ఆదరించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కానాయపల్లి, ఈదులబాయి తండా, సంకిరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రజల కోసం నిరంతరం పరితపించే వ్యక్తి కేసీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల సమస్యలను ఆరు నెలల్లో పరిష్కారిస్తామన్నారు. నిర్వాసితులకు 400 డబుల్ బెడ్రూం ఇండ్లకు ఇచ్చామన్నారు. 24గంటల విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వానికి అండగా ఉందామని కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, ప్రశాంత్, కొండారెడ్డి, బాల్‌నారాయణ, శ్రీను, సుదర్శన్‌రెడ్డి, అయ్యన్న, లక్ష్మణ్‌నాయక్, శ్రీనుజీ పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రగతి..

మదనాపురం, నవంబర్ 11 : సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంతోపాటు గోవిందహళ్లి, దంతనూరు, శంకరమ్మపేట, తిర్మలాయపల్లి, రామన్‌పాడు గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


దంతనూరులో వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- కానుకుర్తిలో ఎన్నికల ప్రచారం


ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

దామరగిద్ద, నవంబర్ 11 : అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కానుకుర్తిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. ప్రతిఇంటికీ ఏదో ఒకరకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురిచేశారన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, లేదంటే గోస పడుతామన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి ఏ పదవి ఆశించకుండా పనిచేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు ఆశిరెడ్డి ఇంటికి వెళ్లి ప్రత్యేకంగా పలుకరించారు. అలాగే మైనార్టీ వార్డులో ప్రజలను కలిసి కారుగుర్తుకు ఓటే వేయాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పిడెంపల్లి, గడిమున్కన్‌పల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు 100మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బక్క నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ భీమయ్యగౌడ్, ఎంపీటీసీ కిషన్‌రావు, పీఏసీసీఎస్ అధ్యక్షుడు ఈదప్ప, కానుకుర్తి ఉపసర్పంచ్ జ్ఞానేశ్వర్, మాజీ సర్పంచ్ భీంరెడ్డి, నాయకులు కేవీఎన్ రెడ్డి, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.